పెండింగ్ వేతనాలు చెల్లించాలని అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నందికొండ, డిసెంబర్ 18 మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పొరుగు సేవల సిబ్బందికి 4 నెలలుగా జీతాలు లేవని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ అడిషనల్ కలెక్టర్ కేశవ్ పటేల్‌కు సోమవారం పొరుగుసేవల సిబ్బంది వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జీతాలు సకాలంలో రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందన్నారు. కార్యక్రమంలో కవిత, శంకరమ్మ, రాణి, అనురాధ, రమేష్, ఇమ్మానుయేల్, రామారావు, జాని, రాంసాయి, మహేష్ పాల్గొన్నారు.

అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మున్సిపల్ పొరుగు సేవల సిబ్బంది

నారు మడ్లి సస్యరక్షణకు చర్యలు చేపట్టాలి : ఏఓ

దామరచర్ల, డిసెంబర్ 18: యాసంగిలో వరి సాగు చేస్తున్న రైతులు వరి నారు మళ్ల సస్యరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కల్యాణచక్రవర్తి సూచించారు. మండలంలోని కేశవాపురం గ్రామంలో సోమవారం వరి నారు మళ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చలి ప్రభావంతో నారు మళ్లు ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగులోకి మారి చనిపోతాయన్నారు. వీటి నివారణకు రైతులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో నారు మడిలోని నీటిని తీసేసి పగలు వెచ్చని నీటిని అందించాలన్నారు, రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిపైన సన్నటి ప్లాస్టిక్ కవర్లు కప్పి మరుసటి రోజు తీసివేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

వరి నారు మడిని పరిశీలిస్తున్న ఏఓ కల్యాణచక్రవర్తి

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వేములపల్లి, డిసెంబర్ 18: అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సోమవారం నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు. మిర్యాలగూడ మండలం కాల్వపల్లికి చెందిన సైదులు, ఎల్లయ్య, అంజయ్య, వీరస్వామి తమ ట్రాక్టర్ల ద్వారా అనుమతులు లేకుండా రావులపెంట మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి : అఖిల్

కొండమల్లేపల్లి, డిసెంబర్ 18: విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్త అఖిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.5300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్స్‌కు పక్కా భవనాలను నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఆత్మగౌరవ అయినటువంటి తెలంగాణ యూనివర్సిటీలో కొత్త కోర్సులు ప్రవేశపెట్టి అభివృద్ధి పర్చాలని కోరారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి'

అడవిదేవులపల్లి, డిసెంబర్ 18: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో రాష్ట్ర పీఆర్‌టీయూ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన ముదిరేసి చెన్నయ్య, సుంకరి భిక్షంగౌడ్ ఎన్నికకాగా వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎస్ రద్దు, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, మూడు పెండింగ్ డీఏల మంజూరు, ఆరోగ్య కార్డుల మంజూరు, కస్తూర్బాగాంధీ బాలికల, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలను చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు ఎస్.కే. మహమ్మద్, ఎట్టిమల్ల రమేష్, ఇంజమూరి సైదులు, పవన్‌కుమార్, ధరావత్ సైదులు, కేదారేశ్వరాచారి తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు జీవన భృతి కల్పించాలి

నేరేడుచర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు

మునగాల : ఆటో కార్మికుల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ

- ఆటో డ్రైవర్ల డిమాండ్
- నేరేడుచర్ల, మునగాల మండలాల్లో నిరసన

నేరేడుచర్ల, డిసెంబర్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం అమలును నిరసిస్తూ పట్టణంలోని మిర్యాలగూడ– కోదాడ రహదారిపై నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు, ఓనర్లు సోమవారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీ బస్సు ఫ్రీతో ఆటోలకు గిరాకీ లేక ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో డ్రైవర్లకు ప్రతినెలా రూ.15వేల వేతనం చెల్లించాలన్నారు. ఆటోలకు ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్‌ను ఉచితంగా అందించాలని, మృతిచెందిన ఆటో కార్మికుడికి రూ.20లక్షల బీమా కల్పించాలన్నారు. అనుభవం కలిగిన డ్రైవర్లను ఆర్టీసీలో ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రాపోలు నవీన్, ఆటో డ్రైవర్లు యూనియన్ నాయకులు హఫీజ్, శ్రవణ్, నరేశ్, మహేశ్, సైదా, ఇబ్రహీం, సంజీవ రెడ్డి, నాగార్జున, నవీన్, వెంకన్న, శంకర్, కిషన్ పాల్గొన్నారు.

మునగాల మండలంలో..

మునగాల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నిరసన ర్యాలీ తీశారు. ఆటో కార్మికుల ర్యాలీకి పీఏసీఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కావున ప్రభుత్వం ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించాలని కోరారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ జానిమియా, ఉపాధ్యక్షుడు మేడిపల్లి సతీశ్, గంధం నారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి : జూలకంటి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, డిసెంబర్ 18: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయ న మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రధానంగా ప్రాజెక్టుల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని చెప్పారు. పట్టణాల్లో నిలిచిపోయిన అంతర్గత డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ వెంటనే చేపట్టాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేశ్, జగదీశ్చంద్ర, రవినాయక్, గౌతంరెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, రామ్మూర్తి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం

త్రిపురారం, డిసెంబర్ 18: సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో ఉన్న పార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లిదేవసే సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6గంటల నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పంచామృతాభిషేకంతో పాటు పలు రకాల అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11గంటలకు స్వామి, అమ్మవారికి కల్యాణం జరిపారు. అనంతరం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు గ్రామ నుంచే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా విరివిగా తరలివచ్చినట్లు ఆలయ పూజారి లోకేష్‌శర్మ తెలిపారు. ఆలయ నిర్వాహకులు ఎల్లయ్య స్వామి ఆధ్వర్యంలో పూజలు, మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, ఎంపీపీ అనుముల పాండమ్మశ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మహిళలు పాటు గ్రామంలోని మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తులు అధిక సంఖ్యలో హాజరు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలో కొలువై ఉన్న వల్లిదేవసే సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని సోమవారం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తిలకించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జిల్లా వ్యాప్తంగా..

రామగిరి: సుబ్రమణ్యేశ్వర షష్టిని జిల్లా వ్యాప్తంగా ఆయా దేవాలయల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలతో పాటు నాగుల వద్ద అభిషేకాలను భక్తులు ఆచరించారు. నల్లగొండ జిల్లాలోని నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు నంది ఆర్చ్ సమీపంలోని 'శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి' ఆలయంకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకులు, ప్రముఖ పురోహితులు దౌలాతాబాద్ వాసుదేవశర్మ, చెర్వుగట్టు పార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రధానార్చకులు డాక్టర్ రామలింగేశ్వరశర్మ ప్రత్యేక్ష పర్యవేక్షణలో 'శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆ ప్రాంతం సుబ్రహ్మణ్య నామ స్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీనివాస్‌నగర్‌లో...

మిర్యాలగూడ రూరల్: మండలం పరిదిలోని శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమ ణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భోగవల్లి వెంకటరమణ చౌదరి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పండితులు మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. మండలంలోని తుంగపహాడ్, జప్తివీరప్పగూడెం, అన్నారం, గూడూరు, మిర్యాలగూడ పట్టణంలో నుంచి వందలాది మంది భక్తులు కల్యాణానికి తరలి వచ్చారు. భక్తులకు దేవాలయ కమిటీ అన్నప్రసాదాలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ గోవింద్, సర్పంచ్‌లు రవీందర్, బారెడ్డి అశోక్‌రెడ్డి , మాజీ సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రిపురారం: స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

రామగిరి: శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి

త్రిపురారం: కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు